క్లుప్తంగా

ప్రభుత్వ సలహాదారుడికి సన్మానం



వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న శివకుమార్‌గౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన హరకార వేణుగోపాల్‌ను గూడూర్ గ్రామానికి చెందిన ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి అభినందించారు. వేణుగోపాల్‌కు ప్రభుత్వ సలహాదారుడితో పాటు సీఎం పబ్లిక్ రిలేషన్ అధికారిగా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

అభ్యంతరం తెలపడం సరికాదు



మాట్లాడుతున్న ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): బీఏసీ సమావేశానికి బీఆర్ఎస్ పక్షాన గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరుకావడంపై సీఎం, మంత్రులు అభ్యంతరం తెలపడం సరికాదని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ అన్నారు. శుక్రవారం శివ్వంపేటలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడే ఆయన పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు బాగాలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌గౌడ్, అశోక్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, హర్షనాయక్, రాజునాయక్, తదితరులు ఉన్నారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ఎస్ఐగా మైపాల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు శుక్రవారం ఆయన్ను కలిసి సన్మానించారు. ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, నాయకులు మర్రి మహేందర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్, మహేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు వాకిటి హన్మంత్‌రెడ్డి, తిరుపతి రాథోడ్, నాగరాజుయాదవ్ ఉన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎంపిక



రవి, మండల అధ్యక్షుడు



నాగులమీరా, ప్రధాన కార్యదర్శి

నర్సాపూర్: యూటీఎఫ్ మండల శాఖ కమిటీని ఎంపిక చేశామని జిల్లా శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి పద్మారావు శుక్రవారం తెలిపారు. మండల కమిటీ అధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా నాగుల్ మీరాలను ఎన్నుకున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడిగా అఫ్రాషాహీన్, డాకియా, కోశాధికారిగా కనకరాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా గంగాధర్, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్ కేవీఆర్ నాయుడు, కార్యదర్శులుగా కృష్ణ, గీత, రంజిత్, శ్రీనివాస్, సురేఖ, రమాజ్యోతి, కల్పనాదేవి, కవిత రామ్మూర్తినాయుడు, రాంబాబులతోపాటు పలు విభాగాలకు ప్రతినిధులను ఎంపిక చేశామని తెలిపారు.

గుండెపోటుతో తండ్రి మృతి..

తలకొరివిపెట్టిన తనయ



నర్సింహులు(ఫైల్)



తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు దివ్య

చిన్నశంకరంపేట(మెదక్): గుండెపోటుతో తండ్రి మృతిచెందగా కూతురు తలకొరివి పెట్టిన ఉదంతం చిన్న శంకరంపేట మండలం మడూర్‌లో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కాడిగల్ల నర్సింహులు(48) గుండెపోటుతో మృతిచెందాడు. ఉదయం నిద్ర లేచి ఇంటి ఆవరణలోని అరుగుపై కూర్చున్నాడు. ఒక్కసారిగా గుండె నొప్పి రాగా అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడని కుటుంబసభ్యులు తెలిపారు. భార్య శ్యామల, కూతురు దివ్య ఉన్నారు. కుమారులు లేకపోవడంతో తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టి అంత్యక్రియలను పూర్తి చేసింది.



ఆలయంలో ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణాన్ని జరిపిస్తున్న పూజారులు



హాజరైన భక్తులు

కమనీయం ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణం

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయం వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం పెద్దపట్నం అలంకరణలో ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉత్సవాలకు చేగుంట, చిన్నశంకరంపేట, దౌల్తాబాద్ మండలాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామాగౌడ్, అంజాగౌడ్, ప్రవీణ్‌గౌడ్, కిషన్‌గౌడ్, సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాఘ అమావాస్య

- మంజీరా నది తీరాన పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు



చిలప్‌చెడ్: చిట్కుల్ శివారులోని మంజీరా నదిలో స్నానాలు చేస్తున్న భక్తులు



చిలప్‌చెడ్: చాముండేశ్వరీ అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు



పెదశంకరంపేట: కొప్పోల్ కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మాఘఅమావాస్య సందర్భంగా శుక్రవారం మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో ఉన్న మంజీరా నదిలో స్నానాలు చేసి చాముండేశ్వరీ అమ్మవారి దర్శనం చేసుకునేందుకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో అమ్మవారి దర్శనార్థం క్యూలో కొద్ది సమయం వేచియున్నారు. అర్చకులు అమ్మవారి ప్రీతికరమైన అభిషేకం, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ స్నానాల అనంతరం అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. మెదక్–జోగిపేట ప్రధాన రహదారి పక్కనే ఆలయం ఉండటంతో పాటు భక్తులు భారీగా రావడంతో ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం కలిగింది. కాగా ప్రయాణికులకు, వాహన చోదకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి సిబ్బంది తగిన చర్యలు తీసుకున్నారు.

కొల్చారంలో..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ప్రజలు మంజీరా నదీ తీరాల్లో స్నానాలు ఆచరించి, దేవాలయాల్లో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి గురు మాధవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో తుక్కాపూర్ గ్రామ శివారులో, మెదక్ –నర్సాపూర్ ప్రధాన రహదారి పోతంశెట్టిపల్లి గ్రామ శివారు హనుమాన్ బండల్ సమీపంలోని మంజీరా నదిలో పెద్ద ఎత్తున భక్తులు స్నానాలు ఆచరించారు. హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

కొప్పోల్‌లో భక్తుల సందడి

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. శుక్రవారం మాఘ అమావాస్య సందర్భంగా వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామికి పూజలు చేశారు. ఆపై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'అక్రమార్కులపై చర్యలు తప్పవు'



ముప్పిరెడ్డిపల్లి పరిశ్రామిక వాడలో భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..

మనోహరాబాద్(తూప్రాన్): పారిశ్రామిక వాడలోంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సాక్షి ప్రచురించిన 'అక్రమంగా మట్టి తరలింపు ' కథనానికి స్పందించి ఐలా కమిషనర్ కేటీనాయక్ సిబ్బందితో కలిసి ఆయన మండలంలోని ముప్పిరెడ్డిపల్లి పరిశ్రామికవాడలో గల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి అక్రమ రవాణా కాకుండా గట్టి చర్యలు చేపడతామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈవిషయంపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వీరి వెంట ఆర్ఐ దీక్షిత్ తదితరులున్నారు.

12న అప్రెంటీస్ మేళా

మెదక్ కలెక్టరేట్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో ఈనెల 12న ఉదయం 9.30 నిమిషాలకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు శుక్రవారం తెలిపారు. ఇందులో ప్రముఖ పరిశ్రమల యజమాన్యాలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల ఐటీఐ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పోటీల నిర్వహణతోనే నైపుణ్యం



మనోహరాబాద్: విద్యార్థులతో ఉపాధ్యాయులు

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తే వారి నైపుణ్యం బయటపడుతుందని మండల నోడల్ అధికారి బాలరాజు తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ అంశాలపై మండలస్థాయిలో చిత్రలేఖనం, ఉపన్యాసం, పద్య రచనలు తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ పట్ల విద్యార్థులు ఇష్టం పెంచుకుంటే భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా మారి కొత్త ఆవిష్కరణలు చేస్తారన్నారు. కౌడిపల్లి బాలికల పాఠశాలకు చెందిన అర్చన, గౌరమ్మ, తునికి ఎంజేపీకి చెందిన శ్రీనివాస్, చరణ్‌తేజ ప్రతిభ కనబర్చడంతో బహుమతులు అందజేశారు.

మనోహరాబాద్‌లో

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో ఉన్న ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ వేడుకలను నిర్వహించినట్లు నోడల్ అధికారి వెంటకస్వామి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన పోటీల్లో పలు గ్రామాలకు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. డ్రాయింగ్‌లో మనోహరాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన అరిబా , కవితలలో వైష్ణవి, పాటలలో అక్షర, ఉపన్యాసంలో కాళ్ళకల్ విద్యార్థిని రేష్మిత ప్రథమ బహుమతులు అందుకున్నట్లు తెలిపారు.

వెల్దుర్తిలో

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, కవిత్వం, పాటలు పాడటం, ఉపన్యాసం వంటి పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలైన విద్యార్థులను జిల్లా సాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ యాదగిరి పేర్కొన్నారు.



ఉపన్యాస పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థిని

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో మండల స్థాయిలో ఉపన్యాసం, పాటలు, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఉపన్యాస పోటీలో చేగుంటకు చెందిన సాదియా, చిత్రలేఖనంలో చందాయిపేటకు చెందిన స్పందన, పద్య రచనలో చేగుంటకు చెందిన అఖిల, పాటల విభాగంలో చందాయిపేటకు చెందిన నందిని ఎంపికయ్యారు. వీరందరూ జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్లు నోడల్ ఆఫీసర్ నీరజ తెలిపారు.

చిత్రలేఖనంలో గురు ప్రసాద్, కవిత్వంలో నందిని, పాటల పోటీలో దీపిక, ఉపన్యాస పోటీలో వైష్ణవి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపన్యాస, చిత్రలేఖనం, పాటలు, పద్యరచన, కవిత్వం తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమాన్ని మండల నోడల్ అధికారి వెంకటేశం పర్యవేక్షించారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం



చిలప్‌చెడ్: చిట్కుల్‌లో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న కార్మికులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలవ్యాప్తంగా ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామాలలో జరిగే పనులను ప్రత్యేక పాలనాధికారులు, పంచాయతీ కార్యదర్శులు దగ్గరుండి చేయిస్తున్నారు. శుక్రవారం గ్రామాల్లో తిరిగి డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచుకోకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు.

నిజాంపేటలో..

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ, నందిగామ గ్రామాల్లో శుక్రవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలోని మురుగు కాల్వలను శుభ్రపరిచి మాలథీయన్ పౌడర్ చల్లారు. తాగునీటి ట్యాంకులను శుద్ధి చేశారు. ఈ సందర్భంగా నందిగామ పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్ మాట్లాడుతూ పై గ్రామంలో స్పెషన్ డ్రైవ్‌లో భాగంగా ఆయా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లు తెలిపారు. రోడ్లపై చెత్త వేయరాదన్నారు.

కొల్చారంలో..

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం ఎంపీడీఓ గణేష్ రెడ్డి మండల కేంద్రంతోపాటు చిన్నఘనాపూర్, వరిగుంతం, సీతరాం తండాలో చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించారు. దోమల వ్యాప్తి, నీటి కలుషితంపై అవగాహన కల్పించారు. గ్యాస్ కనెక్షన్ సర్వేపై ఆరా తీశారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ
- ఘనంగా సంఘం 53వ ఆవిర్భావం



నర్సాపూర్ రూరల్ : పీఆర్‌టీయూ జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

నర్సాపూర్ రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. పీఆర్‌టీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిల్డ్రన్ పార్క్‌లో సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పీఆర్సీ, సీపీఎస్, ఉద్యోగుల ఫ్యామిలీ పెన్షన్ ఇప్పించిన ఘనత పీఆర్‌టీయూదేనన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకొని బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలన్నారు. పెండింగ్ లో ఉన్న మూడు డీఏలు, బిల్లులను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు బీ లక్ష్మీనారాయణ, సొమ్య నాయక్, చందర్, కేజీబీవీ రాష్ట్ర నాయకురాలు స్వరూప రాణి, రాష్ట్ర కార్యదర్శులు వీరేశం, లాలు, దన్ సింగ్, చెన్న, వెంకటస్వామి, బ్రహ్మచారి పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత సామల యాదగిరి గారి జయంతిని పురస్కరించుకొని అల్లాదుర్గం మండల శాఖ ఆధ్వర్యంలో సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం జరిగాయి. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బి.జనార్దన్, మండల ప్రధాన కార్యదర్శి డి.రంజానాయక్ పాల్గొన్నారు.

హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని నారాయణ ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయ ఆవరణలో మండల స్థాయి తాజా మాజీ సర్పంచ్‌లను సన్మానించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాడతామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు మురళి, జెడ్పీటీసీ విజయరామరాజు, వైస్ ఎంపీపీ లక్ష్మి రమేష్, ఎంపీటీసీలు వీణసుభాష్‌గౌడ్, దత్తు, నాయకులు సురేష్‌గౌడ్, శంకరయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రేషన్‌షాపు సందర్శన



చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం రేషన్‌షాపును సందర్శించారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థుల ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా సందర్శించారు. ఇక్కడ అందజేస్తున్న ఉచిత రేషన్ బియ్యం గురించి నిర్వాహకులు చిట్టబోయిన శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఈపాస్ ద్వారా బియ్యం పంపిణీ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, సీఆర్పీ రమేశ్ ఉన్నారు.

◆ ఫోన్ లొకేషన్ ఆధారంగా..

టేక్మాల్ (మెదక్): మండలంలోని అచ్చన్నపల్లి గ్రామం నుంచి అదృశ్యమైన తల్లీకూతుర్ల ఆచూకీ లభించింది. వివరాల్లోకి వెళితే .. చిన్న ఘణపురం గ్రామానికి చెందిన కడాల లావణ్య తన కూతురుతో సహా పుట్టింటినిల్లయినా అచ్చన్నపల్లికెళ్లి ఇక్కడ నుంచి అదృశ్యమైన విషయం విదితమే. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మిస్టరీని ఛేదించారు. ఫోన్‌లొకేషన్ ద్వారా సంగారెడ్డి జిల్లా జోగిపేటలో గుర్తించి టేక్మాల్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. వారి కుటుంబీకులను పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు.

◆ శివస్వాముల పాదయాత్ర

చిలప్‌చెడ్(నర్సాపూర్): మాఘ అమావాస్య పురస్కరించుకుని స్నానాలు చేసేందుకు శుక్రవారం సుమారు 10 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. మండల పరిధిలో ఫైజాబాద్‌లో గల హనుమాన్ ఆలయం నుంచి శివస్వాములు చిట్కుల్ గ్రామ శివారులో గల మంజీరా వాగు వద్దకు చేరారు. ఇక్కడ స్నానమాచరించిన అనంతరం చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శివస్వాములు సత్యనారాయణగౌడ్, సంపత్‌గౌడ్, శశికాంత్, రాజు, రవీందర్ వరప్రసాద్‌రెడ్డి, పరమేశ్వర్, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని జప్తిశివనూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గంగబోయిన స్వామికి శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే రోహిత్ .. మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా రూ.25 వేలను ఎంఎస్ఎస్ఓ సభ్యులతో అందజేయించారు. స్వామి ఎన్నికల సమయంలో స్టేజీపై నుంచి కిందపడగా కాలు ఫ్రాక్చర్ కావడం తెలిసిందే. కాగా ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి రావడంతో నగదును అందజేశారు. అలాగే గ్రామంలో ఇటీవల మృతి చెందిన జెట్టి కమలమ్మ కుటుంబ సభ్యులకు కూడా రూ.5 వేలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రుక్మోద్దీన్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చాంద్‌పాషా, రామ్‌దాస్, గణేష్, కుమార్ ఉన్నారు.

◆ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు రక్తహీనతను నివారించుకోవాలని నర్సాపూర్ ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం) నోడల్ అధికారి, డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని తునికి వద్దగల ఎంజేపీ (మహాత్మా జ్యోతి బాపూలే) బీసీ బాలుర గురుకుల పాఠశాలలో 120 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పలువురు విద్యార్థుల్లో రక్తహీనతను గుర్తించి మందులు పంపిణీ చేశారు. నివారణకు ఆహారంలో పాలు, కోడి గుడ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఐరన్ లోపంవల్ల రక్తహీనత వస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రమేష్, ఫార్మసిస్ట్ శ్రీశైలం, ఏఎన్ఎం బాగ్య, లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ పంటలకు బీమా పథకం అమలు చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): పంటలకు బీమా పథకం అమలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు అక్కమొళ్ల మైసయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం రక్షణ సమితి నాయకులతో కలిసి మాట్లాడారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. పంటలకు సంబంధించి ప్రభుత్వం.. ప్రీమియం చెల్లించి బీమా వర్తింప చేయాలని కోరారు.

◆ కొనసాగుతున్న సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): సబ్సిడీ గ్యాస్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులలో తప్పులు, ఇతర పొరపాట్ల.. సవరణ సర్వే గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలోని వెంకటాపూర్(ఆర్)లో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ మమత, వీఓఏ తదితరులు ఇంటింటికీ తిరిగి మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో సవరణలు చేపట్టారు.

◆ ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

తూప్రాన్: ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా.. కండెల నరసింహులు, గంగోత్రి దంపతులు గుడిసెలో నివాసం ఉంటున్నారు. ప్రమాదవశాత్తు దాని నుంచి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు, బియ్యం, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమైంది.

◆ భూ కబ్జాపై ఫిర్యాదు

మనోహరాబాద్(తూప్రాన్): తన భూమిని కబ్జా చేసి అక్రమంగా పరిశ్రమ నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని బాధితుడు మహమ్మద్ దావూద్ అలీ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం కార్యాలయ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తనకు సర్వే నంబర్ 51లో గల భూమిని అక్రమంగా కబ్జా చేసి పరిశ్రమ నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులు, జిల్లా ప్రజావాణిలో పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తన భూమిని తనకే ఇప్పించాలన్నారు.